క్లుప్తంగా

పెదనెమలిపురంలో అంబటి తనయ ఇంటింటా ప్రచారం



రాజుపాలెం : పెదనెమలిపురిలో రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు తనయురాలు డాక్టర్ మనోజ్ఞ బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా స్థానికులను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. గ్రామంలో గత ఐదేళ్లలో రూ40.89కోట్ల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఒక ఓటు తన తండ్రి అంబటి రాంబాబుకు, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌కు మరో ఓటు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఆమె వెంట స్థానిక సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మశ్రీనివాసరావు, ఎంపీటీసీ కందులూరి నాగేశ్వరరావు, నాయకులు తాటికొండ అంకమ్మరాజు, వేలాద్రి, సీతారామయ్య తదితరులు ఉన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలి

ముప్పాళ్ళ: సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు ఈనెల 25న నామినేషన్ వేయనున్నారని ఆ పార్టీ ముప్పాళ్ళ, నకరికల్లు మండల కన్వీనర్‌లు నక్కా శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి బుధవారం పిలుపునిచ్చారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. రాజుపాలెం మండలం దేవరంపాడు వెంకన్నస్వామి ఆలయంలో పూజల అనంతరం ప్రచార వాహనంపై బయలుదేరి కొండమోడు, రాజుపాలెం మీదుగా సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అంబటి నామినేషన్ వేస్తారన్నారు. నామపత్రాల దాఖలు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రామకృష్ణ సేవాతత్పరుడు

పర్యావరణ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్



సత్తెనపల్లి: సమాజానికి పలు విధాలుగా సేవలందిస్తున్న కొత్త రామకృష్ణ సేవా తత్పరుడని రాష్ట్ర పర్యావరణ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సత్తెనపల్లి వచ్చిన ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్న కొత్త రామకృష్ణను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గా రామకృష్ణ ఎంతో మంచి పేరు తెచ్చుకున్నాడన్నారు. ఎన్నో సదుపాయాలను వైద్యశాలకు కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, ఆర్యవైశ్య నాయకులు గుంటూరు సుహీంద్ర, దొడ్ల రాంబాబు, ఆకుతోట దుర్గారావు, రామలింగేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

కుట్ర రాజకీయాలు మానుకోవాలి



బెల్లంకొండ: తెలుగు దేశం పార్టీకి బెల్లంకొండ మండలంలో ఉనికి లేదని మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఓట్ల కోసం పలు విధాలుగా కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించాలని టీడీపీ నాయకులు ప్రయత్నించడం సరికాదని హితవు పలికారు. గత ఆదివారం రాత్రి మండలంలోని నాగిరెడ్డిపాలెంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రచార వాహనాలను టీడీపీ నాయకులు అడ్డుకొని, దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. పార్టీ కార్యాలయాలు తగలబెట్టే సంస్కృతి తమకు లేదన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుతంత్రాలు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. రెట్టింపు మెజారిటీతో ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని చంద్రారెడ్డి స్పష్టం చేశారు. గంగిరెడ్డి ప్రతాపరెడ్డి, బద్దూరి శేషిరెడ్డి, లక్ష్మారెడ్డి, బద్దూరి వెంకట్రామిరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టి వేత



పిడుగురాళ్ల: అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఎస్ఈబీ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఈబీ సీఐ డి. సూర్యనారాయణ మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణంలోని తమ్మిశెట్టి దుర్గాప్రసాద్ వద్ద నుంచి మ్యాన్సన్ హౌస్ 750 ఎంఎల్ 10 మద్యం సీసాలను పట్టుకోవటం జరిగిందన్నారు. రైల్వే పోలీసులు, ఎస్ఈబీ అధికారులు సంయుక్త దాడిలో అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన ఆలమూరు చిన్న వెంకటేశ్వర్లు వద్ద నుండి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 750 ఎంఎల్ పరిమాణం కలిగిన రాయల్ స్టాగ్ 9 సీసాలను పట్టుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే జగనన్నకే ఓటెయ్యండి

- వైఎస్సార్ సీపీ నరసారావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్
- వేల్పూరు, ఓర్వకల్లు, రుద్రవరం, కోనూరు, కస్తలలో పర్యటన
- అపూర్వ స్వాగతం



ప్రచారరథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శంకరరావు



వేల్పూరులో బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

అచ్చంపేట: రాష్ట్రం బాగుండాలంటే జగనన్నకు ఓటేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని వైఎస్సార్ సీపీ నరసారావుపేట ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని వేల్పూరు, ఓర్వకల్లు, రుద్రవరం, కోనూరు, కస్తల గ్రామాలలో బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. జగన్ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కలగూరగంప కూటమిని నమ్మితే జనసంక్షేమం ఆగిపోతుందన్నారు. మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, అప్పుడు అర్హులెవ్వరికి పథకాలు వర్తించవని, వారి కార్యకర్తలకే ఇచ్చుకుంటారని విమర్శించారు. గతంలో రుణమాఫీ చేస్తానన్న చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఎలా మాట తప్పాడో అందరికీ తెలిసిన విషయమే అన్నారు. మళ్లీ మోసం చేయడానికి కూటమి పేరుతో వచ్చే బాబుకు బుద్ధి చెప్పాలన్నారు. ప్యాకేజి కోసం పార్టీని చంద్రబాబుకు తాకట్టుపెట్టిన పవన్ కళ్యాణ్ కాపుల మనోభావాలు, నిజమైన కార్యకర్తల ఆశలపై నీళ్లుచల్లారని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన జగన్ కావాలా, 600హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చని చంద్రబాబు కావాలో తేల్చుకోవలసిన సమయం వచ్చిందన్నారు. మాయమాటలు నమ్మి మోసపోవద్దని, మంచి చేసే వారికే మద్దతివ్వాలని ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్ కోరారు.

అన్నీ పూర్తి చేస్తా ..మరోసారి అవకాశమివ్వండి నంబూరు శంకరరావు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో రూ.2వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ అయిందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించానన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేశామన్నారు. మూడు వేల మందికి పైగా నిరుపేదలకు నివేశన స్థలాలు ఇచ్చి, రెండువేలకు పైగా పక్కా గృహాలు నిర్మించానన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు ఏ విధంగా ఉండేవో, ఇప్పుడెలా ఉన్నాయో పోల్చిచూడాలని ప్రజలకు గుర్తు చేశారు. గ్రామాలకు పక్కా రోడ్లు వేయించానన్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్‌రోడ్డు పనులు సగానికి పైగా పూర్తయ్యాయని, గెలిచిన వెంటనే ఆ పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి రూ.62కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించానని, టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదని, ఎన్నికలు అయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతామన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్‌ను బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాలకు సాగునీటి అవసరాలకు వచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ప్రతి ఇంటికి మంచి జరిగితేనే ఫ్యాను గుర్తుపై ఓటెయ్యాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, తాత్కాలిక ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ శిఖా తిమోతి, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటి మాజీ అధ్యక్షులు నల్లపాటి సూర్యనారాయణ, పొన్నెకంటి వెంకట్రావు, కుమారస్వామి, గ్రామపార్టీ కన్వీనర్ గోపికృష్ణ, బీసీ నాయకులు గుంజి వెంకట్రావు,పూల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కిషోర్, వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, రావెళ్ల శ్రీధర్ మత్సా శ్రీనివాసరావు, పశుపులేటి జనార్దన్, పాగెళ్ల శ్రీనివాసరావు, కస్తల సర్పంచ్ మహబూబ్ సుభాని, చెన్నమల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

నంబూరు సోషల్ మీడియా బృందం ప్రచారం

గ్రామాభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే నంబూరును గెలిపించాలంటూ విజ్ఞప్తి

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధిని ఉరకలెత్తించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ వైఎస్సార్సీపీ సోషల్ మీడియా బృందం (శంకరన్న టీం) కోరింది. శంకరన్న కోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల వైఎస్సార్సీపీ సోషల్‌మీడియా టీం ఎర్రబాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సీఎంజగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిపనుల కరపత్రాలతో వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అమలు చేయని వాగ్దానాలు, మోసపూరిత మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్‌జగన్ పక్షాన నిలబడలని కోరారు. ఎమ్మెల్యే నంబూరుశంకరరావు హయాంలో ఎర్రబాలెం గ్రామానికి రూ.40 లక్షలతో గ్రామసచివాలయం, రూ.22లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు నిర్మించటం జరిగిందన్నారు. వీటితో పాటుగా రూ.3 లక్షల తో బాలవికాస్ వాటర్ ప్లాంట్, కోటి రూపాయలతో జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి పథకం, 120 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు అందించటం జరిగిందన్నారు. రూ.1.10 కోటితో సీసీరోడ్లు, గ్రావెల్‌రోడ్లు ,డ్రైన్ల నిర్మాణాలు,రూ.3.50 కోట్లతో ఎర్రబాలెం నుంచి గాదెవారిపాలెం వరకు తారురోడ్డు వేయడం జరిగిందని వివరించారు. అభివృద్ధి కోసం పాటుపడుతున్న వైఎస్సార్సీపీకి ఓటు వేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలన్నారు. ఒకటి ఎమ్మెల్యే నంబూరుశంకరరావు, మరొకటి ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌కు వేయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కార్యకర్తలు షేక్‌బాజి, షేక్ ఇమ్రాన్, షేక్ సైదా, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో ..జనసేన, టీడీపీ నాయకుల చేరిక

- బయ్యవరం, క్రోసూరు నాయకుల చేరికలు
- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



నంబూరు శంకరరావు సమక్షంలో చేరిన క్రోసూరు టీడీపీ కార్యకర్తలు.

బయ్యవరం(క్రోసూరు): పెదకూరపాడు నియోజకవర్గం బయ్యవరం, క్రోసూరుకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఆ పార్టీలకు స్వస్తి చెప్పారు. ఈమేరకు బయ్యవరం గ్రామానికి చెందిన జనసేన ,టీడీపీ కార్యకర్తలు, నాయకులు శిరసాని శ్రీనివాసరావు, మల్లయ్య, కంబాల నాగేశ్వరరావు, లక్క శ్రీనివాస్ రావు, మందడి శ్రీనివాసరావు, ఆలూరి బసవయ్య, ఆలూరు శేషయ్య, కోసన లక్ష్మణరావు, క్క నాగేశ్వరరావు, తలారి నరసింహారావు, ఆలూరి బాజీ, ఆలూరి కొండలరావు, సదా మస్తాన్ రావు, తాడి బోయిన అస్సాలాం తదితరులు వైఎస్సార్సీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్రోసూరు నుంచి టీడీపీ కార్యకర్తలు ...

క్రోసూరు: క్రోసూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు మన్నెం సాయి హనుమంతరావు, గుత్తికొండ శ్రీకాంత్ వైఎస్సార్సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలదిఅప్పారావు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ గఫూర్, కాల్వపల్లిశ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి టాటా...వైఎస్సార్ సీపీ బాట

అమరావతి: అమరావతికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకుడు నంబూరు కళ్యాణ్ చక్రవర్తి సమక్షంలో చేరారు. ఈనెల 23న స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చెన్నూరు ఏడుకొండలు, కృష్ణకుమారి, ఎస్‌కె అమీర్, నాగుల్‌మీరా, ఘట్టం రామకోటయ్య, ఫఠాన్ ముంతాజ్, మాబి, జమీన్, షాజిది, ఎస్‌కె బాబులతోపాటు పది కుటుంబాల సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా కళ్యాణ్ చక్రవర్తి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిం చారు. మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జెడ్ పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, వైఎస్సార్‌సీపీనాయకులు నంబూరు బాబురావు, నిమ్మా విజయ సాగరబాబు, నందూరు కరుణకుమార్, రోశిబాబు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రలోభాలు తాత్కాలికం

పెదకూరపాడు టీడీపీ నేతల ప్రలోభాలు తాత్కాలికమైనవని , కొన్ని కారణాల నేపథ్యంలో ఆ పార్టీలో చేరినా ఏదోరోజు మంచిని గ్రహించి తిరిగి వస్తారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రలోభాలకు లోంగే పరిస్థితి లేదన్నారు. ఇటీవల టీడీపీ లో చేరిన మండలంలోని తమ్మవరం, బలుసుపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తిరిగి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీలో చేరారు. కెశం హనుమంతురావు, పైర్ల కోటేశ్వరరావు లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు తమను మభ్యపెట్టి పార్టీకి దూరం చేశారని, పార్టీలో జరుగుతున్న మంచి గుర్తుకు వచ్చి తిరిగి వచ్చామన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజు....తొమ్మిది

సత్తెనపల్లిలో నామినేషన్లు వేసిన అభ్యర్థులు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి ఆరోరోజైన బుధవారం తొమ్మిది నామినేషన్లు దాఖలు చేశారు. పత్రాలను సత్తెనపల్లి ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ అందించారు. టీడీపీ తిరుగుబాటు అభ్యర్థిగా ఎల్.రవి నామినేషన్ వేశాడు. కాంగ్రెస్ నుంచి చుక్కా చంద్రపాల్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున కూరపాటి దావిదురాజు, జై భీమ్ రావు భారత్ పార్టీ నుంచి జొన్నలగడ్డ విజయ్ కుమార్ నామపత్రాలను అందించారు. అలాగే జై భారత్ నేషనల్ పార్టీ నుంచి షేక్ దరియావలి, స్వతంత్ర అభ్యర్థులుగా కందుకూరి జక్రయ్య, పీ.మణికంఠ, తోట వెంకటేశ్వరరావు, మేకల సుబ్బారావులు అభ్యర్థిత్వ పత్రాలను దాఖలు చేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిద్దాం

నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ ఎ శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ, ర్యాలీలు ముగిసిన వెంటనే గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో గురజాల డీఎస్‌పి పల్లపురాజు, సిఐలు శరత్‌బాబు, సురేష్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 299 పోలింగ్ కేంద్రాల్లో 150కి పైగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, ఈ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ, ముఖ్యంగా నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చొరవ చూపాలన్నారు. ఓటరు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు మనందరం సమిష్టిగా పనిచేద్దామని కోరారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా కేంద్ర అదనపు బలగాలు నియోజక వర్గానికి రానున్నట్లు చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ మంజునాధరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ షేక్ బాషా, ఫణీంద్ర, శర్మ, ఆర్‌ఐలు, ఎన్ శ్రీనివాసరావు ఉన్నారు.

పోలేపల్లిలో వైభవంగా ఆలయ ప్రతిష్టా మహోత్సవం



పోలేపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయం

దుర్గి : మండలంలోని పోలేపల్లి గ్రామంలో బుధవారం శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీతారాములను, ఆంజనేయ స్వామి మూలవిరాట్ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విజయవాడ భువనేశ్వరి పీఠాధిపతులు పరమహంస హరి వజ్రాచార్యులు శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామి చేతుల మీదుగా ఆలయంలో విగ్రహాలను సీతారామ, లక్ష్మణ విగ్రహాలతో పాటు, ఆలయం ముందు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. గ్రామస్తులు దాదాపుగా రూ. 80లక్షలకు పైగా ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. గత ఐదు రోజులుగా 18 మంది ఋత్వికులతో వేదమంత్రోచ్చారణల నడుమ యజ్ఞాలు నిర్వహించారు. వేద పండితులు వెంపటి వంశీకృష్ణ శర్మ, జి కాశీ కోటేశ్వరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంపటి పురుషోత్తమ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు బూసాని వెంకటరాజు, బూసాని జానకయ్య, నామసాని సత్యనారాయణ, బూసాని చిన రామచంద్రయ్య, ఎంపీటీసీ నామసాని ఆంజనేయులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు పేరు పొందిన రెంటచింతలలో ప్రయాణికులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకు ఎస్టీయూ యూనియన్ ఉపాధ్యాయులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ విశాల్ ఉప్రే, స్టేట్‌బ్యాంక్ మేనేజర్ పున్నయ్య అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఎస్టీయూ ఏపి రెంటచింతల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేసవికాలం అంతా కొనసాగేలా ప్రయాణికులకు, గ్రామస్తులకు చల్లటి మంచినీటిని పంపిణీ చేసేలా చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ఏపి రెంటచింతల శాఖ అధ్యక్షులు ఎం. బేబీరాణి, ప్రధాన కార్యదర్శి షేక్ ఖుద్దూస్, ఆర్థిక కార్యదర్శి ఎం. వెంకటేష్, సంఘం నాయకులు లేళ్ళ శ్రీనివాసరావు, నాగేశ్వరావు, కె. చంద్రం, జి. చంద్రశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం

మాచర్ల : పల్నాటి ప్రజల ఇలవేల్పు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవం మంగళవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి ప్రతి రోజూ ఈఓ సాంబయ్య, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ స్వామి వారిని వివిధ వాహనాలపై ఊరేగిస్తున్నారు. ఈ నెల 28న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని తిలకిస్తారు.

102 / 110

ఇదీ బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉత్తీర్ణత



బి. విష్ణు తేజ (578)



సీహెచ్. యజ్ఞశ్రీ (575)



జి ధనలక్ష్మి (570)



పఠాన్ సమీర (561)



బి రంజాన్ బీ (557)

సత్తెనపల్లి: మండలం బృగుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాల నుంచి మొత్తం 110 మంది పరీక్షలకు హాజరవగా..102 మంది ఉత్తీర్ణులయ్యారు. 93 శాతం ఫలితాలు నమోదయ్యాయి. వీరిలో ప్రథమశ్రేణి 91, ద్వితీయ 8, తృతీయశ్రేణిలో ముగ్గురు పాసయ్యారు. ఐదుగురు 550కు పై మార్కులు సాధించగా, మరో 24మంది 500కు పై మార్కులతో నిలిచారు. 578 మార్కులతో బొజ్జ విష్ణు తేజ పాఠశాల టాపర్‌గా నిలిచాడు. చలువాది యజ్ఞశ్రీ 575, గాడిదపాటి ధనలక్ష్మి 570, పటాన్ సమీర్ 561, బానపల్లి రంజాన్ బీ 557 తర్వాత స్థానాల్లో ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానో పాధ్యాయుడు గంగరాజు సుధాకర్ అభినందించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

సత్తెనపల్లి: అనుమతులకు విరుద్ధంగా సత్తెనపల్లిలోని పలు దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరుకుపాలేనికి చెందిన తలతోటి సురేష్ పట్టణంలో పలు దుకాణాల్లో 288 మద్యం సీసాలు కొనుగోలు చేసి తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నాగన్నకుంట ప్రాంతంలో పట్టుకున్నారు. సురేశ్ ను, పట్టణ పోలీస్ స్టేషన్ లో అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎమ్. సత్యనారాయణ తెలిపారు.

శాంతియుత ఓటింగ్‌కు సహకరించాలి

ముప్పాళ్ళ: గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ఓటర్లు సహకరించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు చెప్పారు. మండలంలోని మాదల, తొండపి, రుద్రవరం గ్రామాల్లో కేంద్ర అదనపు పోలీసు బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో యువత గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాలీలో ఎస్సై పీ.హజరతయ్య, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ నేత గఫూర్



గఫూర్‌కు పార్టీ కండువా కప్పుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ఎంఎ గఫూర్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకర్గ కార్యాలయంలో బుధవారం జల వనరుల శాఖా మంత్రి, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు సమక్షంలో చేరారు. ఈమేరకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. కూటమి పార్టీల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీలో చేరటం శుభపరిణామన్నారు. అలాంటి వారి సేవలను గుర్తించి భవిష్యత్ లో సముచిత స్థానంతో పార్టీ గౌరవిస్తుందని మంత్రి అంబటి అన్నారు.నియోజకవర్గంలో మైనార్టీలకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచిందని, వారి మరింత బలోపేతం చేసేలా పార్టీ కృషి చేస్తుందన్నారు. పార్టీ విజయ వంతానికి కృషి చేయాలని గఫూర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మహబూబ్ జానీ,తదితరులు ఉన్నారు.

ఘర్షణ పై కేసు నమోదు

ముప్పాళ్ళ: పొలానికి నీళ్ళు పెట్టుకునే సమయంలో జరిగిన ఘర్షణపై బాధితుడి ఫిర్యాదు మేరకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీ.హజరతయ్య తెలిపారు. మండలంలోని కుందురువారిపాలెం గ్రామానికి చెందిన పాశం శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు పొలానికి నీళ్ళు పెట్టుకునే విషయంలో గొడవ పడ్డారు. సంఘటనలో పాశం శ్రీనివాసరావు పై బత్తుల వెంకటేశ్వర్లు మరో ఆరుగురు కలిసి దాడి చేయటంతో స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనివాసరావు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ

పిడుగురాళ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టినట్లు పట్టణ ఎస్ఐ అమీర్ తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ అమీర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను ప్రభుత్వ నిషేధిత మద్యం, అక్రమ నగదుతో పాటు ఇతర వస్తుల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అందులో భాగంగానే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటివారిపై పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐతోపాటు పోలీస్ సిబ్బంది దాసు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పంచిన నీవు ఆకస్మికంగా మా నుండి దూరమైనా, మా హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటావు. అసమాన కృషితో ఆహర్నిశలు మా అభివృద్ధికి బాటలు వేసిన నీవు భౌతికంగా దూరమైనా, నీ మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

శ్రీమతి కొల్లి వెంకటసుబ్బమ్మ గారు
మరణం : 11-04-2024

భర్త
కొల్లి నరసింహారెడ్డి
Rtd. H.M.,
సెల్ : 9618576192

పెదకర్మ : ది. 25-04-2024 గురువారం పెదకూరపాడు మండలం, 75త్యాళ్ళూరు గ్రామములోని మా స్వగృహము నందు జరుగును.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com